ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక


MHR TV

మెదక్ సంపుటి : 18 సంచిక : 323 ఆదివారం, జులై 20, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**- అమిత్ షా వెల్లడి**



**న్యూఢిల్లీ** 2027 నాటికి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ శరవేగంగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ, 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి

2లో..

## 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, మణిపూర్ కు వెళ్లలేదు

**- ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్**

2లో..



# కమలంలోలో కుమ్ములాట

**- కేంద్ర మంత్రిపై ఈటల తీవ్ర ఆరోపణలు**

- శామీర్‌పేటలో ఎంపీ ఈటెల కార్యకర్తల సమావేశం
- తాను పదవుల కోసం మాత్రం పార్టీ మారలేదన్న ఈటల రాజేందర్
- కేసీఆర్‌కు మొహమాటం లేకుండా నా నిర్ణయాలు చెప్పేవాడినన్న ఈటల
- తన ఓటమికి చాలామంది కుట్రలు చేశారన్న ఈటల రాజేందర్
- ఇకపై స్ట్రీట్ ఫైట్ కాదు, స్ట్రయిట్ ఫైటే ఉంటుందన్న ఈటల
- కార్యకర్తలకు కచ్చితంగా అండగా ఉంటానన్న రాజేందర్





**హైదరాబాద్** బీజేపీలో కొత్తగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రామచందర్‌రావుకు మరో సవాల్ ఎదురైంది. కరీంనగర్ బీజేపీలో ముసలం పుట్టినట్టు కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా కాస్త సైలెంట్‌గా ఉన్న ఈటల రాజేందర్ శనివారం కార్యకర్తలను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు.

శత్రువుతో కోట్లాడుతామే కానీ కడుపులో కత్తులు పెట్టుకొని కావలించుకునే కుట్రలు చేయడం తెలియదని అన్నారు. తనపై తన వర్గంపై సోషల్ మీడియాలో ఓ వ్యక్తి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అన్నింటినీ ఢిల్లీకి పంపే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. రేపటి గెలుపునకు షామీర్‌పేట అడ్డగా మారుతుందని ఈటల అన్నారు. తాను బీజేపీలోకి అడుగు పెట్టే వరకు అక్కడ బీజేపీకి కార్యకర్తలే లేరని చెప్పుకొచ్చారు. తాను వచ్చిన తర్వాత గ్రామగ్రామన పార్టీ బలోపేతం అయిందని చెప్పుకొచ్చారు. అలాంటిది తనను కోవర్ట్ అని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. "రేపటి గెలుపునకు సంకేతం ఇచ్చే అడ్డా షామీర్‌పేట. దాన్ని పట్టుకొని వాడు ఎవడో వాడు సైకోనా? శాడిస్టా? మనిషా? పశువా? వాడు ఏ పార్టీలో ఉన్నాడు? ఎవరి అండతో ఆ ధైర్యం చేస్తున్నాడు? వాడిని ఏనాలి?. బి కేర్‌ఫుల్ కొలికా! మేము శత్రువుతో కొట్లాడుతాం కానీ కడుపులో కత్తులు పెట్టుకొని కావలిచ్చుకునే సంస్కృతి మా రక్తంలో లేదు. " అని వార్నింగ్ ఇచ్చారు.సోషల్ మీడియాలో తప్పుడు కూతలు కూస్తున్న వాళ్లకు సమాధాం చెబుతానని ఈటల అన్నారు. ఇలాంటి వారిని పార్టీ అరికడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లేకుంటే ఎవరికి నష్టమే అర్థంచేసుకోవాలని చెప్పారు."ఎవడెవడు సోషల్ మీడియాలో పెడుతున్నారో, ఏమేమి రెచ్చగొడుతున్నారో, ఏమేమి చేస్తున్నారో మొత్తం పైకి పంపించే ప్రయత్నం చేస్తా. నేను అనుకుంటున్న సంస్కారం ఉందని సభ్యత ఉందని ,ఇట్లాంటి వాటిని అరికడతారని భావిస్తున్నా. అరికట్టకపోతే నష్టపోయేది ఎవరో అర్థం చేసుకోండి. " అని అన్నారు. ఇలాంటి వాళ్ల చరిత్ర ప్రజలకు బాగా తెలుసనని అన్నారు ఈటల. తన పని తీరు ఏంటో కూడా తెలుసునని చెప్పుకొచ్చారు. "ఇలాంటి వారిని నివారించకపోతే నష్టం జరిగేది మాకు కాదు.మాకు ఏం తక్కువ ఉంది. అసలు మీరు ఎవరు. అసలు నీ శక్తి ఏంది. నీ యుక్తి ఏంది, నీ చరిత్ర ఏంది, మా చరిత్ర ఏందిరా, నా జిల్లాకి 2002లో వచ్చినా.

2లో..



## తెలంగాణలో కులగణన సర్వే చారిత్రాత్మకం

**సీఎం రేవంత్ తో ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ కమిటీ భేటీ**

- ప్రభుత్వానికి కుల గణన సర్వేపై నివేదికను సమర్పించిన నిపుణుల కమిటీ
- దేశానికి రోల్ మాడల్ అని కమిటీ అభిప్రాయం
- నివేదికలోని అంశాలు మంత్రిమండలి సమావేశంలో చర్చించాలని నిర్ణయం

**హైదరాబాద్** దేశంలో కుల గణన చేపట్టిన తొలి ప్రభుత్వం తమదే అని తెలంగాణ సర్కార్ చెబుతోంది. కులగణనపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ తెలంగాణ ప్రభుత్వానికి 300 పేజీల నివేదికను సమర్పించింది. ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణులు శనివారం సమావేశమయ్యారు. వర్కింగ్ గ్రూప్ ఛైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ కంచె ఐలయ్య, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రవీణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ హిమాన్షు, నిఖిల్ డే, డా. సుఖదేవ్ తొరాట్, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్లు పురుషోత్తం రెడ్డి, జీన్ డ్రెజ్, థామస్ పికెట్టి, సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఈ సందర్భంగా తమ నివేదికను అందించారు. ఈ కులగణన సర్వే సైంటిఫిక్, అథెంటిక్, రిలయబుల్ అని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సర్వే చారిత్రాత్మకమని, ఇది దేశానికి రోల్ మోడల్ గా మారుతుందని నిపుణుల కమిటీ పేర్కొంది. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలతో పాటు వారి సూచనలను కేబినెట్ భేటీలో చర్చించి ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను కొన్ని నెలల కిందట నిర్వహించింది.మొదటి విడతలో భాగంగా 2024 నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25 వరకు దాదాపు 50 రోజుల పాటు తెలంగాణలో సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం జనాభా సమాచారం సేకరించేందుకు ప్రతి జిల్లాలో ప్రతి 150 కుటుంబాలను ఒక బ్లాక్ గా చేసింది. ఒక్కో బ్లాక్ కు ఒక ఎన్యుమరేటర్, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్వైజర్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లతో ప్రభుత్వం శాస్త్రీయంగా సర్వే చేయించింది. మొదటి విడతలో రాష్ట్రంలో96.9 శాతం కుటుంబాలను సర్వే చేసి ఆయా కుటుంబాల వివరాలను 36 రోజుల్లో డేటా ఎంట్రీ సైతం చేశారు.దమొదటి దశలో హౌస్ లిస్టింగ్ చేసిన కుటుంబాలు సర్వేలో తమ వివరాలు నమోదు చేయకపోవటంతో ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు రెండో విడతలో అవకాశం

2లో..

## ఎవరికీ షేక్ హ్యాండ్స్ ఇవ్వొద్దు

**- తెలంగాణ ప్రభుత్వం సంచలన హెచ్చరిక**

**హైదరాబాద్** తెలంగాణలో రానున్న ఐదు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. దోమల వ్యాప్తి నివారణకు ఇంట్లోని తలుపులు, కిటికీలను దోమ తెరలతో కప్పి వేయాలని సూచించింది. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఆహారం, నీటి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య శాఖ పేర్కొంది.

2లో..

## హైడ్రా విజయాలతో పాటు సవాళ్లను కూడా ఎదుర్కొంది


**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**




**హైదరాబాద్** ఈ సంవత్సరం విజయాలతో పాటు పలు సవాళ్లను కూడా ఎదుర్కొన్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ ఏడాది కాలంలో హైడ్రాపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించామని ఆయన వెల్లడించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటే ఏమిటో ప్రజలకు హైడ్రా ద్వారా అవగాహన వచ్చిందని తెలిపారు. పార్టీలో చేరగా, వారికి మహేశ్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

2లో..

## రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేషన్ కుమార్ సింగ్ ప్రమాణం



**తెలంగాణ** హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు,ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు హాజరయ్యారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధిస్తాం

**- ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా**



హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ గత నెలలో మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక రానుంది. ఈ ఉప ఎన్నికలో గెలుపుపై అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని అన్నారు. అంతకుముందు, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మురళీ గౌడ్, సంజయ్ గౌడ్ పార్టీలో చేరగా, వారికి మహేశ్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## దుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి, ఎంపి

**విజయవాడ** విజయవాడ ఇంద్రకీలాద్రిలో కొలువుదీరిన కనకదుర్గమ్మను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ కేశినేని చిన్ని శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మ ర్యాద ల తో ఈవో రామారావు స్వాగతం పలికారు. అమ్మవారి ద ర్శనం అనంత రం ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అంద జేశారు. అనంతర ఈవో ప్రజాప్రతినిధులకు అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు

# నిడదవోలు ఈఈ సస్పెండ్

### మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి** గోదావరి వెస్టన్ డివిజన్ నిడదవోలు ఈఈ పి. సుబ్రహ్మణ్యేశ్వరావు ను సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ఆదేశాలిచ్చిందని మంత్రి రామానాయుడు వెల్లడించారు.


మంత్రి మాట్లాడుతూ నిడదవోలు రైల్వే పై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చిన, క్రాస్ బండ్ ను సకాలం లో తొలగించకపోవడం లో అలసత్వం వహించారని అన్నారు. గోదావరి వెస్టన్ కెనాల్ పరిధిలోని బ్యాంక్ కెనాల్, నిడదవోలు, నరసాపురం నియోజకవర్గాల్లో ఏర్పడిన సాగు నీటి కొరత ఏర్పాడింది. స్వయంగా ఆదేశించినా పనులు పూర్తి చేయకపోవడం తో ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసామని అన్నారు..

### టీటీడీలో పనిచేస్తున్న

## నలుగురు అన్యమత ఉద్యోగులు సస్పెండ్

**తిరుపతి,** టీటీడీలో పనిచేస్తున్న బి.ఎలిజర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ( క్వాలిటీ కంట్రోల్), ఎస్. రోసి, స్టాఫ్ నర్స్, బర్డ్ ఆసుపత్రి, ఎం.ప్రేమావతి, గ్రేడ్ -1 ఫార్మసిస్ట్ , బర్డ్ ఆసుపత్రి, అదేవిధంగా డా.జి.అసుంత. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ లలో విధులు నిర్వహిస్తున్న ఈ నలుగురు ఉద్యోగులను టిటిడి సస్పెండ్ చేసింది. సదరు నలుగురు ఉద్యోగులు క్రిస్టియన్ మతాన్ని అనుసరిస్తున్నారని అందుకు సంబంధించిన ఆధారాలు ,వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వారిని సస్పెండ్ చేయడం జరిగింది.సదరు ఆరోపణల నేపథ్యంలో టీటీడీ ఉద్యోగులు పనిచేస్తూ సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని భావించడమేకాక, హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ భాధ్యతా రహితంగా వ్యవహరించడం జరిగింది .ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో సదరు నలుగురు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయడం జరిగింది.

# భార్యను చంపిన భర్త సూసైడ్



**తిరుపతి** చంద్రగిరి నియోజకవర్గం మంగళం సమీపంలో శనివారం తెల్లవారుజామున ఉష తన భర్త లోకేశ్వర్ చేతిలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే హత్య అనంతరం లోకేశ్వర్ సైతం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుమల నగర్ లోని ఆయన ఇంటిలో ఉరి వేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, సీఐ సునీల్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# యూరియా.. ఏదయా...!



**వైరా :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాతలకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. యూరియా ఎదయా అంటూ నిలదీతల పర్వం ప్రారంభమైంది. వైరా మండలంలోని పాలడుగు గ్రామంలో యూరియా కోసం రైతులు శనివారం ఉదయం ఆందోళనకు దిగారు. ఈ గ్రామంలోని సొసైటీకి సంబంధించిన గోదాము శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ గోదాములో యూరియా నిల్వచేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల ఈ గ్రామానికి మూడు లారీల యూరియా కేటాయించారని రైతులు చెబుతున్నారు. అయితే యూరియా నిల్వచేసే స్థలం లేదని ఆ మూడు లారీల యూరియాను పక్కనే వున్న గొల్లపూడి గ్రామానికి తరలించారని రైతులు పేర్కొంటున్నారు. తమ గ్రామం పేరుతో వచ్చిన యూరియాని గొల్లపూడి తరలించినప్పుడు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపూడిలో యూరియా పంపిణీ చేస్తున్నామని తమ గ్రామంలో కనీసం చాటింపు కూడా వెయ్యలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మూడు లారీల యూరియా ఎవరికి ఎప్పుడు ఎక్కడ పంపిణీ చేశారంటూ రైతులు నిలదీస్తున్నారు. శనివారం ఉదయం పాలడుగు గ్రామానికి ఒక లారీ లోడ్ యూరియా సరఫరా చేశారు. దీంతో యూరియా కోసం గ్రామంలోని రైతులందరూ ఒక్కసారిగా ఎగబడ్డారు.అయితే రైతులందరికీ యూరియా సరిపడే పరిస్థితి లేకపోవడంతో ఆందోళనకు దిగారు. సొసైటీ గోదాము వద్ద రైతులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఒక్క లారీ లోడ్ యూరియా తమ గ్రామానికి ఎలా సరిపోతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజుల క్రితం వచ్చిన మూడులోడ్ల లారీలను గ్రామంలోని రైతులకు పంపిణీ చేయకుండా ఎందుకు ఇతర గ్రామానికి తరలించాలని ప్రశ్నిస్తున్నారు. ఒక దశలో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఒకటి రెండు రోజుల్లో మరో లారీ యూరియాను గ్రామానికి తీసుకువస్తామని సంబంధిత సిబ్బంది చెప్పటంతో రైతులు శాంతించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత వారం రోజుల నుంచి రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. జిల్లాలోని సొసైటీలో ప్రభుత్వం నిర్ణయించిన రూ.266.50 యూరియా బస్తాను విక్రయిస్తున్నారు. అయితే ప్రైవేటు డీలర్లు మాత్రం 350 నుంచి 400 రూపాయలకు బ్లాక్ లో యూరియాని విక్రయిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు

### ఘనంగా ప్రారంభమైన

## తాండూర్ ఉర్సు ఉత్సవాలు

- ఈ ఉత్సవాలకు వంద ఏండ్ల చరిత్ర
- వివిధ రాష్ట్రాల నుండి భక్తుల రాక
- కట్టుదిట్టంగా పోలీస్ భద్రత ఏర్పాట్లు



**తాండూర్** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే బెల్లంపల్లి నియోజకవర్గంలో గల తాండూర్ ఉరుసు ఉత్సవాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ మేరకు ఆదివారం తాండూర్ గ్రామంలోని దర్గా వద్ద ఘనంగా ఉరుసు ఉత్సవ వేడుకలను ప్రారంభించారు ఈ ఉరుసు ఉత్సవాలు గత 300 సంవత్సరాల నుండి కొనసాగుతున్నాయి. ఈ యొక్క ఉత్సవాల్లో కవాలి నృత్యాలు సైతం ఉండనున్నాయి. ఇందుకు గాను వివిధ. రాష్ట్రాల నుండి కళాకారులను రప్పిస్తున్నారు. అవి అక్కడికి వచ్చిన భక్తులను ఎంతగానో అలరింపచేస్తూ ఆకట్టుకుంటాయి. ముక్యంగా కవాలి నృత్యాలు తిలకించడానికి చిన్నా, పెద్దా తేడా లేకుండా హాజరవుతారు. రాత్రింబవళ్లు అక్కడ కాలక్షేపం చేయడం ప్రతీ ఏట కనబడుతుంది. ఎంతో ప్రాముఖ్యం గల ఈ ఉరుసు ఉత్సవాలను తిలకించడానికి వివిధ రాష్ట్రాల నుండి సైతం భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. కుల,మత వర్గాలకు అతీతమైనది కావడంతో ఈ ఉత్సవంకు ఎంతో ప్రాధాన్యం, ప్రాముఖ్యం సంతరించుకుంది. దీంతో సబ్బండ వర్గాలు తరలి రావడం మనకు శనిపిస్తుంది. కొంత మంది ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి ముందస్తుగానే తాండూర్ మండల కేంద్రానికి చేరుకున్నారు. వారి వారి సమీప బంధువుల ఇళ్లళ్ళకు చేరుకున్నారు. ఈ వేడుకలకు దర్గా కమిటీ ముందస్తు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ మేరకు దర్గా చుట్టుపక్కల సమీప పరిసరాలను పరిశుభ్రం చేశారు. దర్గా నిర్మాణాలకు సైతం రంగులు అర్థి అలంకరించి చేశారు. ఈ తృవాలకు రానున్న భక్తులుకు ఎలాంటి అసౌకర్యం కాకుండా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కమిటీ జదివరకే ప్రకటించింది. సందర్శకుల సౌకర్యార్థం చిరు వ్యాపార సముదాయాలు వెలిశాయి. ఈ సమదాయాల్లో తినుబండారాల నుండి మొదలుకొని పిల్లల ఆట వస్తువుల వరకు లభించును ఈ రెండు రోజుల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా దర్గా కమిటీకి పోలీసు వారు సైతం దిశా నిర్దేశం చేస్తున్నారు.

## యూరియా కోసం చెప్పుల క్యూ

**భూపాలపల్లి** వానాకాలం పంటలకు కావలసిన యూరియా కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు తిప్పలు పడాల్సి వస్తోంది. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతున్నప్పటికీ డిమాండ్ మేరకు సప్లై లేకపోవడంతో రైతులు సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. పీఏసీఎస్ ఆవరణలో చెప్పుల లైను దర్శనమిచ్చింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూరియా కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

## 30 రూపాయలకే చీర ఆఫర్ తన్నుకున్న మహిళలు

**అనంతపురం:** తాడిపత్రి లో కాసం ఫ్యాషన్స్ లో మహిళలు పరస్పరం జుట్టు పట్టుకుని కొట్టుకున్నారు. ఆషాడం సందర్భంగా బంపర్ ఆఫర్ సేల్స్ అంటూ కాసం యాజమాన్యం ప్రచారం చేసింది. 30 రూపాయలకే చీర అనడంతో మహిళలు తండోపతండాలుగా వచ్చారు. భారీగా మహిళలు రావడం తో యాజమన్యం ఏర్పాట్లు చేయలేక చేతులెత్తెసింది. కవరేజ్ కు వెళ్లిన జర్నలిస్టుల ను లోపలికి అనుమతించలేదు.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మంత్రి పొంగూరు నారాయణ, సంగీత దర్శకుడు మణి శర్మ, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే స్వామివారిని విడివిడిగా వీఐపీ ప్రారంభ సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

దర్శనానంతరం వీరికి అధికారులు ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేణిగుంటకు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

**తిరుపతి** జిల్లా పర్యటన నిమిత్తం విజయవాడ నుండి ప్రత్యేక విమానంలో రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు.అనంతరం రోడ్డు మార్గాన రేణిగుంట మండలం తూకివాకంలో తిరుపతి కార్పొరేషన్ కు చెందిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను సందర్శించడానికి బయలుదేరి వెళ్లారు.

## రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు

### ఎంపి మిథున్ రెడ్డి

**విజయవాడ** సిట్ విచారణకు హాజరు కాకమయుందు ఎంపీ మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సిట్ చీఫ్ రాజశేఖర్ బాబుతో ఫోన్లో మాట్లాడాను. విచారణకు వస్తున్నట్లు సమాచారం ఇచ్చనని అన్నారు. ఏపీలో కక్షపూరిత రాజకీయాలు జరుగుతున్నాయి.. మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు. కేసులకు భయపడే ప్రసక్తే లేదు.. భయపడే వ్యక్తిని అయితే రాజకీయాల్లోనే ఉండనని అన్నారు.తప్పుడు కేసులను ధైర్యంగా ఎదుర్కొంటా.. 2014-19లోనూ నాపై తప్పుడు కేసులు పెట్టారు. నా ఫోన్ లు మీకు ఇస్తా.. విచారణకు సహకరిస్తా.. ఏదో రకంగా బురదజల్లాలని చూస్తున్నారని అన్నారు.

### 2027 నాటికి మూడో

## అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

దేశంలో అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశాభివృద్ధి 60 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించినట్లు అమిత్ షా వెల్లడించారు. వాజ్ పేయి హయాంలో భారతదేశం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, మోదీ పాలనలో నాలుగో స్థానానికి చేరుకుందని, త్వరలోనే మూడో స్థానానికి ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టేందుకు మోదీ సంకల్పించారని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఆర్థిక ర్యాంకింగ్స్‌లో అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే భారత్ కంటే ముందున్నాయని ఆయన గుర్తు చేశారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని అధిగమిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దీని కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వాణిజ్య నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ కంపెనీలను ఆహ్వానించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

### 42 దేశాలు తిరిగొచ్చారు కానీ,

## మణిపూర్ కు వెళ్లలేదు

**- ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్**

న్యూఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 42 దేశాలను సందర్శించిన ప్రధాని మోదీ, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపూర్ రాష్ట్రాన్ని మాత్రం ఇప్పటివరకు సందర్శించలేకపోయారని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో గత కొంతకాలంగా హింసాత్మక సంఘటనలు, గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆయన ఆరోపించారు. దేశ ప్రధానమంత్రిగా మోదీ సొంత దేశంలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విదేశీ పర్యటనలపై దృష్టి సారించడం సరికాదని ఖర్గే వ్యాఖ్యానించారు. మణిపూర్ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడానికి మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, స్థానిక నాయకులతో చర్చించాలని ఆయన సూచించారు. మణిపూర్‌లో శాంతి, స్థిరత్వం తీసుకురావడానికి తక్షణ చర్యలు అవసరమని ఖర్గే పేర్కొన్నారు. అంతేకాకుండా, రాజ్యాంగాన్ని మార్చే ఏ ప్రయత్నమైనా దేశ ప్రజల హక్కులను హరించే చర్యగా పరిగణించబడుతుందని ఖర్గే హెచ్చరించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, దానిని బలహీనపరిచే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

## కమలంలోలో కుమ్ములాట

జిల్లాకి రెండు సార్లు నేను జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పని చేశా. నేను రెండుసార్లు మంత్రిగా పని చేసినా. నా అడుగుపడని గ్రామాలు లేవు కరీంనగర్ జిల్లాలో. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉదయం పొయ్యి ముట్టిస్తే రాత్రి 12 గంటల కూడా ఆ పొయ్యి ఆరిపోయేది కాదు. ఒక్క హుజరాబాదు ఒక కమలాపుర్ వచ్చినోళ్ళు కాదు బిడ్డ మొత్తం కరీంనగర్ జిల్లా వచ్చేది. పక్క జిల్లాల ప్రజలు కూడా అప్పుడప్పుడు వచ్చిపోయారు.నేను పోని మండలం ఉంటదా నేను మాట్లాడనటువంటి జాతులు ఉంటాయా మీకు మా చరిత్ర తక్కువ తెలుసు కొలికా అని విరుచుకుపడ్డారు.ఈటల రాజేందర్ ఎవరిని ఉద్దేశించి మాట్లాడారనే చర్చ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. కేంద్రమంత్రిని టార్గెట్ చేస్తూనే ఈటల రాజేందర్ ఇలాంటి కామెంట్స్ చేశారని అంటున్నారు. ఈ మధ్య కాలంలో ఆ మంత్రి తనను ఓడించేందుకు హుజూరాబాద్‌లో కుట్ర జరిగిందని ఆరోపించారు. ఈ కామెంట్స్ వైరల్ కావడంతో ఈటల రాజేందర్‌పై ఒత్తిడి పెరిగింది. ఈటర రాజేందర్ అనుచరులు గత కొన్ని రోజుల నుంచి ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కేందమంత్రిగా ఉన్న వ్యక్తి తమను టార్గెట్ చేసుకొని మాట్లాడుతున్నారని పార్టీలో ఉండాలా బయటకు వెళ్లిపోవాలా చెప్పాలంటూ డిమాండ్ చేశారు. శనివారం ఏకంగా ఈటల ఇంటికే అభిమానులు తరలి వచ్చారు. వారిని ఉద్దేశించి మాట్లాడిన ఈటల ఆ మంత్రిపై విమర్శలు చేసినట్టు కనిపిస్తోంది. స్థానికంగా నాయకులను ప్రోత్సహిస్తేనే రేపటికి గెలుపు ఈజీ అవుతుందని అన్నారు. 2002నుంచి తాను అదే నమ్ముతున్నానని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా హుజూరాబాద్‌లోని ప్రతి గ్రామం, మండలంలో తన అనుచరులే పోటీ చేస్తారని విజయం సాధిస్తారని చెప్పుకొచ్చారు. కేంద్రమంత్రి, మాజీ మంత్రి మధ్య సాగుతున్న ఈ అంతర్గత కుమ్ములాటను కొత్తగా ఎంపికైన స్టేట్ పార్టీ అధ్యక్షుడు ఎలా డీల్ చేస్తారో అన్న ఆసక్తి బీజేపీలో ఉంది.

## ఎవరికీ షేక్ హ్యాండ్స్ ఇవ్వొద్దు

రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. దోమల వ్యాప్తి నివారణకు ఇంట్లోని తలుపులు, కిటికీలను దోమ తెరలతో కప్పి వేయాలని సూచించింది. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఆహారం, నీటి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య శాఖ పేర్కొంది. కాచి చల్లార్చిన నీటినే తాగాలని పేర్కొంది.పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించింది. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని ఆరోగ్యశాఖ సూచించింది. ముఖ్యంగా దోమల వ్యాప్తి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సంక్రమిస్తాయని వైద్య శాఖ పేర్కొంది. ఇంటి పరిసరాల్లోని సెప్టిక్ ట్యాంకులు, ఇతర నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమలు సంతానోత్పత్తి చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించింది. వర్షాకాలంలో సాధారణంగా ప్రజలు జలుబు, జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఇబ్బందులు పడుతుంటారని ఒక్కోసారి ఇవి తీవ్రమైన అంటువ్యాధుల లక్షణాలు కూడా మారొచ్చని అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. బయటి వ్యక్తులతో కరచాలనం (హ్యాండ్ షేక్) వీలైనంతగా తగ్గించాలని శానిటైజర్ తో చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యారోగ్య శాఖ సూచనలు చేసింది.

## హైడ్రా విజయాలతో పాటు సవాళ్లను కూడా ఎదుర్కొంది

అదే సమయంలో చెరువులు, నాలాల వద్ద ఆక్రమణలు కూడా తగ్గినట్లు వెల్లడించారు. ఏడాది కాలంలో దాదాపు 500 ఎకరాల వరకు కాపాడామని అన్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.30 వేల కోట్లు ఉంటుందని రంగనాథ్ వెల్లడించారు. హైడ్రా కారణంగా కబ్జాలు తగ్గాయని అన్నారు. దాదాపు 20 చెరువుల్లో ఆక్రమణలను తొలగించినట్లు ఆయన వెల్లడించారు. భారీ వర్షం కురిసినప్పటికీ ఈ నీరు బతుకమ్మకుంట చెరువులో చేరడం ద్వారా వరదను తగ్గించినట్లు చెప్పారు. దాని వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అన్నారు. మరికొన్ని చెరువుల్లో కూడా ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. హైడ్రా వచ్చిన తర్వాత నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని వెల్లడించారు. ఆక్రమణల విషయంలో హైడ్రా చాలా సీరియస్‌గా ఉందని అన్నారు. మూసీతో హైడ్రాకు సంబంధం లేకపోయినప్పటికీ తమకు ఆపాదించారని అన్నారు. హైడ్రా పెద్దల జోలికి వెళ్లదు, పేదలను లక్ష్యంగా చేసుకుంటుందని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో కులగణన సర్వే చారిత్రాత్మకం

కల్పించింది. మీ సేవా కేంద్రాలు, ఎంపీడీవో ఆఫీసులు, జీహెచ్ఎంసీ, వెబ్‌సైట్ ద్వారా వారి వివరాలను ఎంట్రీ చేయించింది. ఈ సర్వే ఫలితాల ప్రకారం తెలంగాణలో 1,15,71,457 గృహాలు ఉన్నాయి. 1,12,36,849 (97.10 శాతం) కుటుంబాల నుంచి 3,55,50,759 మంది ఈ సర్వేలో పాల్గొని తమ వివరాలు నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలో ఎస్సీలు 61,91,294 మంది (17.42 శాతం), ఎస్టీలు 37,08,408 మంది (10.43 శాతం), బీసీలు 2,00,37,668 మంది (56.36 శాతం), ఇతర కులాలకు చెందిన వారు 56,13,389 మంది అంటే 15.89 శాతం మంది ఉన్నారు. కొంతకాలం కిందట ప్రభుత్వం కుల గణన సర్వే చేసింది. సర్వే వివరాల నివేదికను తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీకి సమర్పించింది. సర్వే ఫలితాలను అధ్యయనం చేసి విధాన నిర్ణయాలను రూపొందించేందుకు వీలుగారాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి సుదర్శన్రెడ్డి గారి అధ్వర్యంలో 11 మంది సభ్యులతో స్వాతంత్ర్య నిపుణుల వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసింది. కుల గణన సర్వే ఫలితాలను విశ్లేషించి వివరణాత్మక నివేదికను అప్పగించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించింది. వివిధ దఫాలుగా సమావేశాలు జరిపిన కమిటీ కుల గణన సర్వే డేటాను సేకరించిన పద్ధతి సరిగ్గా ఉందని గుర్తించింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనతో పాటు ఇప్పుడు అమల్లో ఉన్న విధానాలను మెరుగుపరిచేందుకు, సామాజిక న్యాయం, సామాజిక సాధికారత, వెనుకబడిన బలహీనవర్గాల వర్గాలకు మేలు చేయడానికి కుల గణన నివేదిక సహాయపడుతుందని నిపుణుల కమిటీ సూచించింది.

# రోజా అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

**తిరుపతి** నగరి మాజీ మంత్రి రోజా ఎమ్మెల్యే భాను ప్రకాష్ పై ఆరోపణలు చేస్తున్నారు. గాలిలో గెలిచాడు.. గాలిలో కొట్టుకు పోతాడని అన్నారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ 45వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2019లో రోజా కి 330 ఓట్లు మాత్రమే వచ్చాయని టీడీపీ నేతలు అన్నారు. 2019- 2024 వరకు ఎమ్మెల్యే గా మంత్రిగా, వివిధ పదవులు పొంది ఆమె మాత్రమే అభివృద్ధి చెందింది తప్ప నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. ఆమె హయాంలో నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు జరిగాయి. ఆమె అన్నదమ్ముల అభివృద్ధి చెందారు. ఏపీఐఐసీ ఛైర్మన్ గా ఏమి చేసిందో చెప్పాలి, కుటుంబ సభ్యులతో పంచుకుని దాచుకున్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, మైనింగ్, బియ్యం, ఇసుక, దోచుకొని దాచుకున్నారు. ఎమ్మెల్యేల గాలి భానుప్రకాష్ పై ఆరోపణలు తగవని అన్నారు. కూటమి ప్రభుత్వం లో నియోజవర్గం అంతటా రోడ్లు వేసి అభివృద్ధి పనులు పూర్తి చేశాము. గతంలో జడ్పీటీసీ నిధులు రూ.140 కోట్లలలో ఎంత తెచ్చావు.. నిధుల కోసం లేఖ రాసిన నిధులు రానివ్వకుండా అడ్డుపడింది. కూటమి ప్రభుత్వం జడ్పీటీసీ నిధులతో రూ.1.20 కోట్లు తాగు నీటి కి తెచ్చామని అన్నారు. రెండు కోట్లు నాబార్డు నిధులతో రోడ్డు వేస్తాము.. కేవలం నెల రోజుల్లో పనులు ప్రారంభమవుతాయి. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ 2వేల గురించి మాట్లాడారు.. ఆ రెండువేలు కమీషన్ తీసుకుని రోజా కుటుంబసభ్యులు నియోజకవర్గంలో అన్ని రకాల పనులు చేశారని ఆరోపించారు. రోజా వాళ్ల అన్నమీదే కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చెప్పింది మరచిపోయారు.. రోజా కుటుంబం 6నెలలు బాగా ఉంటారు.. మరో ఆరు నెలలు వీడి పోతారు.. ఆదాయం ఉంటే మళ్లీ కలుసుకుంటారు.. ఇలాంటి వారు గాలి భాను ప్రకాష్ కుటుంబ గురించి మాట్లాడుతున్నారు. నగరి అభివృద్ధి విషయంలో సలహాలు ఇస్తే సేకరిస్తాం..కాని ట్రోలింగే కోసం ఇష్టానుసారం మాట్లాడుతుందని విమర్శించారు. చెక్కులు తీసుకుని పాదిరేడువద్ద భూములు, టోల్ గేట్ వద్ద ఫారెస్ట్ భూమి అమ్ముకున్నారు. ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. .

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ ఆదివారం 20, జులై 2025



## తెలంగాణ సంప్రదాయ పండుగ ప్రాముఖ్యత బోనాల పండుగ..




**శామీర్ పేట జూలై 19 (ప్రజా స్వరం)** తుర్కపల్లిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ రాష్ట్ర సంప్రదాయ పండుగల ప్రాముఖ్యత, వాటి ఆచారాలు, సంస్కృతి గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి రెడ్డి హాజరై బోనాల పండుగ చరిత్ర, దాని సాంస్కృతిక విలువలను వివరిస్తూ, విద్యార్థులు తమ సంస్కృతిని కాపాడుకోవాలని ప్రేరేపించారు. పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి బోనాల పండుగలో గల శక్తి ఆరాధన సమాజంలో దాని ప్రత్యేకత గురించి వివరించారు. విద్యార్థులు బోనాల సంప్రదాయ వేషధారణలో సాంప్రదాయ నృత్యాలు, పాటలు ప్రదర్శించి, వేడుకలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూల బోనాలను అలంకరించి, దేవతను పూజిస్తూ భక్తిని వ్యక్తపరిచారు. పాఠశాల ఇంచార్జ్ గ్రేస్ రెడ్డి, గౌసియా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. సంప్రదాయ పండుగలు సమాజంలోని ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

## నాయి బ్రాహ్మణుల దెబ్బతీసే ఆర్టికల్ 19ని వెంటనే ఎత్తివేయాలి

**- మేడ్చల్ జిల్ల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిట్కుల సత్యం నాయి..**



**శామీర్ పేట జూలై 19(ప్రజా స్వరం)** నాయి బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతీసే ఆర్టికల్ 19ని వెంటనే ఎత్తివేయాలని నాయి బ్రాహ్మణులు తాతల ముత్తాతల నుండి ఇదే కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని మేడ్చల్ జిల్ల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిట్కుల సత్యం నాయి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆర్టికల్ 19 ని వెంటనే వ్యక్తివేయాలని లేనిచో ఇలాంటి జీవోనే ఇతర కులస్తులకు కూడా హైకోర్టు తీసుకు వస్తుందని ప్రతి ఒక్క 12 కులాల కులవృత్తుల వాళ్లకు ఇలాంటి ఆర్టికల్ తీసుకువస్తే ప్రతి కులస్తుడు రోడ్డు ఎక్కే పరిస్థితి వస్తుందని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సత్యం నాయి ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి హైకోర్టు పెద్ద మనసుతో వెంటనే ఆర్టికల్ 19ని రద్దు చేయాలని కోరారు.

## విద్యుత్ షాక్ తగిలి పాడి గేదె మృతి చెందిన



**రామాయంపేట. 19.( ప్రజా సర్వం)** కంచలేని ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి పాడి గేదె మృతి చెందిన ఘటన రామాయంపేట మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కాట్రియాల గ్రామానికి చెందిన బైగిరి శ్యామ్ అనే రైతుకు చెందిన పాడి గేదే వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్ఫార్మర్ వద్ద షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల మేర నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు

## ఔటర్ రింగ్ రోడ్డు వద్ద 42 కిలోల గంజాయిని స్వాధీనం



శామీర్ పేట జూలై 19(ప్రజా స్వరం) ఔటర్ రింగ్ రోడ్డుపై 42కిలోల గంజాయిని శామీర్‌పేట పోలీసులు పట్టుకున్నారు. గంజాయితో పాటు 3 సెల్ ఫోన్లు, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... కర్ణాటక బీదర్‌కు చెందిన అంతరాష్ట్ర ముఠా బెల్లాలే ప్రవీణ్, అవినాష్ అలియాస్ వికాస్ జాదవ్, సతీష్ కదంలు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరచు వచ్చి ఎండు గంజాయిని అమ్ముకుని వెళ్లేవారు. ఈ క్రమంలోనే ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా పోడియా గ్రామానికి చెందిన జితు అలియాస్ హ్యాపీ నుంచి 42 కిలోల గంజాయిని సేకరించారు. పథకం ప్రకారం సంగారెడ్డి జిల్లా నాగిల్గిద్ద మండలంలోని మావినెల్లికి చెందిన రాథోడ్ హీరామన్‌కు విక్రయించాలని బయలుదేరారు. ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారనే పక్క సమాచారంతో శామీర్‌పేట, మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద వలపన్ని పట్టుకున్నారు. ప్రవీణ్, వికాస్ జాదవ్, సతీష్ కదంలను అదుపులోకి తీసుకుని వారి నుండి 42 కిలో గంజాయి, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇప్పటికే వికాస్ జాదవ్‌పై మంగళ్‌హాట్‌లో 3 కేసులు, సతీష్ కదంపై కుల్సుంపురలో 2 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎంపీ, పీఎం చిత్రపటాలకు పాలాభిషేకం..





**మెదక్ జూలై 19 (ప్రజా స్వరం)** మెదక్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఎంపీ రఘునందన్ రావు కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, రఘునందన్ రావు ల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ దుండిగల్ రింగ్ రోడ్డు నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వరకు నాలుగు లైన్ల హైవే రోడ్డు, మెదక్ పట్టణానికి రింగు రోడ్డు మంజూరైన సందర్భంగా పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేయడం జరుగుతుందని అన్నారు. రింగ్ రోడ్డు వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తగ్గడం జరుగుతుందని అన్నారు. మెదక్, నర్సాపూర్ రోడ్డు ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించిన ఎంపీ రఘునందన్ రావు ఈ నాలుగు వరసల రోడ్డు తో ప్రమాదాలను నియంత్రించవచ్చని సదుద్దేశంతో ఈ రోడ్డు కోసం ఆయన అందరినీ ఒప్పించి తీసుకుని రావడం జరిగిందని అన్నారు. ఈ రోడ్ల మంజూరు కు కృషి చేసిన ఎంపీ రఘునందన్ రావుకు మెదక్ జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మండల అధ్యక్షురాలు బెండ వీణ, నాయకులు శివ, వితలేష్, రాము, రంజిత్ రెడ్డి,ఏసురెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో భాజపాను గెలిపించాలి

**- ఎంపీ రఘునందన్ రావు**





**సిద్దిపేట, (ప్రజాస్వరం) :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని అన్ని స్థానాల్లో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులు గెలవాలని అందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ గారి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కార్య చాలా కార్యక్రమం జరిగింది. జిల్లా స్థానిక ఎన్నికల ప్రబారి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్. ఎస్ ప్రభాకర్ రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి గెలిచేందుకు అవసరమైన అంశాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలు అందించాలని తెలిపారు. పార్టీ అభ్యర్థులు గెలిచాక ఏం చేస్తామో వారికి వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో జాప్యంపై ప్రజలకు తెలిసేలా వివరించాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలకు ఎంత నష్టం జరిగిందో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లాలోని ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ స్కూల్ లో ఘనంగా బోనాల పండుగ





**పఠాన్ చెరు (ప్రజాస్వరం)** పటాన్ చెరు,సాయి కాలనీలోని కళ్యాణ్ పాఠశాలలో, ప్రిన్సిపాల్ థాకూరు కిన్నెర,ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమైన పండుగని, తెలంగాణ అంటేనే సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం అని విద్యార్థులకు చదువుతోపాటు, మన సాంప్రదాయాలు సంస్కృతి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థులు తయారుచేసిన బోనాలను ఊరేగింపుగా విద్యార్థులతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సాయి కుమారి, సుప్రియ, తులసి, ఇంద్ర,జారీనా, లిఖిత, భాగ్యలక్ష్మి, స్వాతి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం...





**మెదక్ జూలై 19 (ప్రజా స్వరం)** అర్హులైన అబ్దిదారులందరీకి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. శనివారం మెదక్ ఎంపిడిఓ ఆవరణలో హౌజింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌజ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఎన్నో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని గుర్తుచేశారు. గుడిసె లేని తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడమే ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మెదక్ నియోజకవర్గం లోని పేదలందరికి విడుతల వారీగా ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు.రేవంత్ సర్కార్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విదంగా ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. రైతులందరికి ఏకకాలంలో రుణమాఫీ చేశామని, రైతు భరోసా అందజేశామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోనే యాభై వేల పై చిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కి అహర్నిశలు కృషిచేస్తానని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కాంగ్రెస్ నేతలు మధుసుదన్, బొజ్జ పవన్, సమీ, కొండ శ్రీను, ఉమర్, అవారి శేఖర్, హౌజింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

## మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

హైదరాబాద్ ఆదివారం 20, జులై 2025


## వచ్చే ఎన్నికల్లో కుకునూర్ పల్లి మండలం పై

# బీజేపీ జెండా ఎగరడం ఖాయం

**- మెదక్ ఎంపీ రఘునందన్ రావు**





**గజ్వేల్ (ప్రజాస్వరం) :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుకునూర్ పల్లి మండలం పై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. దానికి ఉదాహరణ ఎంపీ ఎన్నికల్లో మండలం లో ఓటింగ్ శాతం ఎక్కువగా రావడమే అన్నారు మండలం లో గెలుపు దిశగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు . జిల్లా బీజేపీ అధ్యక్షులు భైరి శంకర్ ముదిరాజ్ , మండల పార్టీ అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో కుకునూరు పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పునూరి వీరేశం, బీఆర్ఎస్ పార్టీ నుండి ముషణం, నాగరాజు గౌడ్ లతో పాటు వివిధ గ్రామాల నుండి భారీ ఎత్తున యువత ముఖ్య నాయకులు తిప్పరం,బోబ్బైపల్లి, లకూడారం, మాత్పల్లి, రాయ వరం, చిన్నకిష్టాపూర్,గ్రామాలలో నుండి కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీల నుండి ఎంపీ సమక్షంలో బీజేపీ లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కుకునూర్ పల్లి. మండలం లో కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ లకు భవిష్యత్తు లేదన్నారు. సందర్భంగా వీరేశం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఎంత కృషి చేసిన కృషి తగ్గ గుర్తింపు లేకుండా పోయింది అని అన్నారు. 20 ఏళ్లుగా మా కుటుంబం కాంగ్రెస్ పార్టీ కోసం మండలం లో కష్టపడుతున్నా తగిన గుర్తింపు లేకుండా పోయిందన్నారు. కుకునూర్ పల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న తీరు కాంగ్రెస్ ను నమ్ముకున్న కార్యకర్తలకు నష్టం జరిగే విధంగా ఉంది అని అన్నారు బీజేపీ విధివిధానాలు నచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి సుపరిపాలన, కేంద్ర ప్రభుత్వ పథకాలు నచ్చిఅవసరమని భారతీయ జనతా పార్టీలో చేరడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుకునూర్పల్లి మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు నంద కిషోర్ శర్మ ,జిల్లానాయకులు, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కవిత ప్లాన్ ఏంటీ...



**నిజామాబాద్ :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించాయి. దీంతో ఆధిపత్యపోరులో ఎవరి వైపు ఎవరుంటారనే చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ ను సమర్థిస్తూ సంబరాలు చేసుకోవడం, దాన్ని ప్రశ్నిస్తూ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం, ఆవిషయంలో పార్టీ తనకు మద్దతు ఇవ్వకోవడంపై ఆమె నర్మగర్భ వ్యాఖ్యలు చేయడంతో పరిస్థితి ఇంకా ముదిరింది. అయితే తాను పార్టీలో ఉండలేక, మరో పార్టీలో చేరలేక, కొత్త పార్టీ పెట్టలేక అంతర్గత మథనం కొనసాగుతోంది.తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ పార్టీకి అనుసంధానంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి పేరుతో సాంస్కృతిక భూమిక నిర్వహించారు. తదనంతరం కేటీఆర్ రాజకీయ రంగప్రవేశంతో పార్టీలో తన ప్రాభవం తగ్గినట్లు భావిస్తున్నారు. పార్టీ ప్రధాన నిర్ణయాల్లో ప్రముఖ పాత్ర నిభాయించిన ఆమె తండ్రి ఇచ్చిన బలంతో ఎదురులేని శక్తిగా పార్టీలో ఎదిగారు. పార్టీ పరిస్థితుల గురించి గ్రౌండ్ రియాలిటీస్ తెలిసిన కవిత కు పెద్దాయన కేసీఆర్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారని చెబుతారు. అయితే రెండో టర్మ్ ఎన్నికల సందర్భంగా తిరిగి పోటీ చేసిన కవిత అదే పార్లమెంట్ పరిధిలో ఓటమి చవిచూడడం పార్టీలో ప్రాధాన్యత విషయంలో వెనుకబడ్డారు. ఆ సమయంలో కేటీఆర్ వర్గం ఆయన్ను ముఖ్యమంత్రి చేసే అవకాశాలున్నాయని అంతర్గతంగా ప్రచారం చేయడం. మీడియా కూడా ఆ విషయాన్ని హైప్ చేయడంతో దాదాపు నెల రోజుల పాటు అంతర్గతంగా పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించే పనిలో పడిన కేసీఆర్ ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టాలని, ఎవరు ఈ విషయంపై మాట్లాడినా చర్యలు ఉంటాయని హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ విషయంలో కవిత, కేసీఆర్ ను ప్రభావితం చేసి ఉండవచ్చని కూడా కథనాలు వెలువడ్డాయి. కేటీఆర్ ఆ సమయంలో సీఎం కాకుండా అడ్డుగా నిలిచింది కవితనే అని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. కవిత మొదటిసారి నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచిన తరువాత ఆ పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు ఆమెకుఏర్పడిన తరువాత మద్దతుగా నిలిచారు. ఆ తరువాత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ను నియమించి పార్టీ పగ్గాలు పగ్గాలు అప్పగించడం, ఆ తరువాత ఎన్నికలో పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే.అయితే ఎంపీ ఎన్నికల్లో తన ఓటమికి పార్టీ నాయకులే కారణమని అనుచర, సహచర వర్గాలతో వ్యాఖ్యానించడం. తరువాత లిక్కర్ కేసులో ఉచ్చు బిగుసుకొని జైలు పాలవ్వడంతో జరిగింది. అయితే జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాత కవిత మౌనంగా ఉంటుందని భావించారు. కానీ అందుకు విరుద్ధంగా జాగృతి నాయకుల ను తిరిగి కార్యోన్ముఖులను చేస్తూ తన ప్రాభవాన్ని చాటుకునే ప్రయత్నంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు కార్యక్రమాలను నిర్వహించడం పనిగా పెట్టుకున్నారు. కార్యక్ర మాలకు బిఆర్ఎస్ నాయకులు హాజరుకాక పోవడంతో కూడా పార్టీలో తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని పసిగట్టి, తండ్రి కేసీఆర్ కు పార్టీ పరిస్థితిపై సూచనలు అందిస్తూనే, పార్టీలో తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ లేఖ రాయడం, ఆ లేఖ మీడియా కు బహిర్గతం కావ డం, ఈ విషయంపై ఆమె సీరియస్ గా కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయని మీడియా ముందు వ్యాఖ్యానించడం సంచలనంగా మారిం ది. ఒక సమయంలో కవిత కొత్తపార్టీ పెడుతుందని ప్రచారం జరిగింది. తనకు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు పార్టీలోని బలమైన శక్తులు ప్రయత్నం చేస్తున్నట్లు గ్రహించిన ఆమె ఇంకా దూకుడు ప్రదర్శిస్తూ, మరికొన్ని కార్యక్రమాలను తీసుకున్నారు. కానీ ఆమె దూకుడును తట్టుకోలేకనే ఆమె కాళ్ళలో పార్టీ పెద్దలే కట్టె పెడుతున్న ఈ సమయంలో కవిత ఏం నిర్ణయం తీసుంటుందోననే చర్చ, ఊహాగానాలు కుప్పలు, తెప్పలుగా వినిపిస్తున్నాయి.

## యాక్టింగ్ సీఎం...

# అసలు ఎప్పుడు

**- ట్రెండింగ్‌లో పవన్**

**విజయవాడ :** ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి త్వరలో తన క్యాబినేట్ సహచరులతో కలిసి సింగపూర్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పాలన పగ్గాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అప్పగించబోతున్నట్టు వార్తలు వచ్చాయి. సోషల్ మీడియాలో ఓ వర్గం వాళు దీన్ని తెగ ప్రచారం నిర్వహించారు. దీనిపై కూటమి ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీలో పొత్తులో ఉన్న తెలుగు దేశం, జనసేన మధ్య చీలిక తీసుకురావడానికి వైసీసీకి చెందిన కొంత మంది నేతలు వీటిని వ్యూహాత్మకంగా ప్రచారం చేసారని చెబుతున్నారు. ఇద్దరి మధ్య చిచ్చు రాజేసి అందులో చలిమంటలు కాచుకునే వ్యూహంతోనే ఈ ప్రచారానికి వైసీపీ తెర లేపిందని చెబుతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పలు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంగా వివిధ దేశాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎపుడు తన బాధ్యతలను వేరే వాళ్లకు అప్పగించిన దాఖలాలు లేవు. ఇలా వేరే వాళ్లు ఇంఛార్జ్ ప్రైమ్ మినిస్టర్, ఇంఛార్జ్ ముఖ్యమంత్రులనేవి రాజ్యాంగంలో లేవు.ఒకవేళ ప్రధాని గానీ, ముఖ్యమంత్రి కానీ.. తమకు వీలు లేనపుడు తమకు సంబంధించిన ఫైల్స్ క్లియర్ చేయమని తమ క్యాబినేట్ సహచరుల్లో ఎవరికైనా ఒకరికి బాధ్యతలు అప్పగించవచ్చు. కేవలం గవర్నర్ ను తెలిగిస్తే.. మాత్రమే వేరే వాళ్లకు ఇంఛార్జ్ గవర్నర్ పదవులను అప్పగించడం అనేది రాజ్యాంగంలో ఉంది. ఇక చంద్రబాబు నాయుడు, వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి గానీ.. మాజీ సీఎం కేసీఆర్ కానీ విదేశీ పర్యటనలకు వెళ్లినపుడు ఎక్కడా ఇంచార్జ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించిన దాఖలాలు లేవు. అక్కడి నుంచే ఆన్ లైన్ లోనే సమీక్షలు నిర్వహించేవారని గుర్తు చేస్తున్నారు. అయితే ఉప ముఖ్యమంత్రులను గౌరవించడంలో చంద్రబాబే తర్వాతే ఎవరైనా అని టీడీపీ, జనసేన శ్రేణులు చెబుతున్నాయి. గతంలో కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాల్లో చాలా మంత్రి డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా.. వారి ఫోటోలను ఎక్కడా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించని దాఖలాలు లేవు. కానీ చంద్రబాబు నాయుడు మాత్రం తన ఫోటోతో పాటు డిప్యూటీ సీఎం ఫోటోలను ఉంచారనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే వైసీపీ నేతల మాత్రం చంద్రబాబు నాయుడు ఏ దిక్కు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పవన్ ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. అయితే రాజ్యాంగం ప్రకారం సీఎం అందుబాటులో లేనపుడు తన క్యాబినేట్ లో ఓ మంత్రికి ఇంఛార్జ్ బాధ్యతలు అప్పగించవచ్చు. ఇది పూర్తిగా సీఎం విచక్షణ అధికారంపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ పవన్ కళ్యాణ్ కు బాధ్యతలు అప్పగించాలనుకుంటే చంద్రబాబు ఇంఛార్జ్ సీఎంగా ఆయన్ని నియమించవచ్చు. రాజ్యాంగంలో ఉప ముఖ్యమంత్రి పదవి లేదు. క్యాబినేట్ పదవిలో భాగంగా ఏర్పడిన పదవి మాత్రమే. అయితే ముఖ్యమంత్రి ఇతర దేశాలకు వెళ్లినపుడు కానీ.. ఆయన ఆరోగ్యం బాగాలేపుడు తన క్యాబినేట్ సహచరులుకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి.

**మరెప్పుడు** పవన్ ఏపీ సీఎం' ఇప్పుడిదే ట్రెండింగ్.. ఏ వెబ్ సైట్ చూసినా.. ఏ సోషల్ మీడియా ఓపెన్ చేసినా పవన్ సీఎం అంటూ హోరెత్తిస్తున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెల్‌లు, కొన్ని మీడియా వెబ్‌సైట్లు "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తాత్కాలికంగా ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తున్నారు" అనే ప్రచారాన్ని చేస్తున్నాయి. జనసేన అభిమానులు ఈ వార్తను ఆనందంగా పంచుకుంటూ, "మన కలలు నెరవేరాయి" అంటూ పోస్టులు చేస్తున్నారు. అయితే, ఈ వార్తకు ఉన్న ఆధారాలు ఏమిటి? వాస్తవం ఏమిటి? అసలు ఇది సాధ్యమేనా? అన్నది ప్రశ్న.డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ తాత్కాలికంగా సీఎంగా బాధ్యతలు తీసుకోనున్నారంటూ పలు సోషల్ మీడియా ఖాతాలు ప్రచారం ప్రారంభించాయి. కొన్ని యూట్యూబ్ ఛానెల్‌లు దీనిని "బ్రేకింగ్ న్యూస్"గా ప్రసారం చేశాయి. దీని మీదే ఆధారపడి జనసేన అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.ఇది చంద్రబాబు వ్యూహమేనా? లేక ఎవరో మంట పెట్టే ప్రయత్నమా? అన్నది అందరికీ డౌట్ కొడుతోంది. ఈ ప్రచారం గమనిస్తే, ఇది ఒక రాజకీయ మాయాజాలంగా కనిపిస్తోంది. చంద్రబాబు విదేశీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ఆ సమయంలో పవన్‌ను తాత్కాలికంగా సీఎం చేస్తారన్న ఊహాగానాలు వ్యాప్తి చెందడం, టీడీపీ-జనసేన మధ్య అపోహలు కలిగించాలన్న కుట్రగా అనిపిస్తోంది. చంద్రబాబు రాజకీయంగా ఎంత అప్రమత్తుడో అందరికీ తెలిసిందే. గతంలో ఎన్టీఆర్ విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కర్ రావు ఏకంగా సీఎం అయ్యి ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచాడు. దానికి చంద్రబాబే నాడు ప్రధాన సాక్షి కావడంతో బాబు ఇలాంటి ప్రయోగాలు అస్సలు చేయడు. చేయలేడు. నాలుగు రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం బాధ్యతలు ఎవరికీ అప్పగించరు. మరీ ముఖ్యంగా డిప్యూటీ సీఎం అయిన పవన్ కళ్యాణ్‌కు అప్పగించడం అసంభవం అనే చెప్పాలి.రాజ్యాంగం ప్రకారం "డిప్యూటీ సీఎం" అనే పదవి కేవలం లాంఛనప్రాయమైనది. దీనికి ప్రత్యేక అధికారాలు ఉండవు. అది ఒక గౌరవ హోదా మాత్రమే. పాలనా వ్యవహారాల్లో డిప్యూటీ సీఎంకు ఏ ప్రత్యేక అధికారం ఉండదు. మంత్రివర్గంలోని ఒక సాధారణ సభ్యుడిగానే ఆయన్ను పరిగణిస్తారు. ఒక సీఎం విదేశీ పర్యటనలలో ఉన్నప్పుడు సాధారణంగా ఏ బాధ్యతను కూడా తాత్కాలికంగా ఇతరులకు అప్పగించరు. ఎందుకంటే బాబు ఎవరినీ నమ్మడు.. అత్యవసర ఫైళ్లను, ముఖ్య నిర్ణయాలను విదేశాల నుంచే పరిశీలించగల సామర్థ్యం చంద్రబాబుకు ఉంది. అంతేకాదు, గతంలో ఎన్నిసార్లు విదేశీ పర్యటనలలో పాల్గొన్నా ఎప్పుడూ ఇన్‌చార్జి సీఎంగా ఎవరినీ నియమించలేదు.ప్రస్తుతం మంత్రివర్గంలో టీడీపీ తరఫున కీలకమైన బాధ్యతలు నారా లోకేష్ చూసుకుంటున్నారు. అయితే ఆయనకు కూడా ఇన్‌చార్జ్ సీఎంగా అవకాశం ఇవ్వలేదు. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్‌కు ఇస్తారా? అదీ ప్రత్యేక ప్రయోజనం లేకుండా? దీన్ని బట్టి బాబు నమ్మడు.. పవన్ సీఎం కాలేడు అన్నది నిజం..ఈ ప్రచారం వెనుక అసలైన ఉద్దేశ్యం, టీడీపీ-జనసేన మధ్య సున్నిత బంధాన్ని బలహీనపర్చడమే అనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ అభిమానుల్లో "ఇదిగో మేము కోరుకున్నది నెరవేరింది" అనే భావన కలిగించి, తర్వాత అది నిరాశకు దారితీసేలా, తద్వారా అసహనం పెంచే ప్రయత్నం అయి ఉండవచ్చు.సమాజంలో మారుతున్న ప్రచార పద్ధతుల వలన ఎంతటి అవాస్తవమైన వార్తలైనా హోరెత్తేలా మారాయి. కానీ ప్రజలు, ముఖ్యంగా రాజకీయ విషయాల్లో ఆసక్తి కలిగిన వారు, సంక్షిప్తంగా కాకుండా విశ్లేషణాత్మకంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వార్తపై ఉద్వేగం కన్నా సూక్ష్మ పరిశీలన అవసరం. "వాట్సాప్ విశ్వాసం" కంటే "వాస్తవ విజ్ఞానం" మిన్న.

## భారత్‌ను ఊహించని దెబ్బ కొట్టిన పాక్..


# రూ. వందల కోట్లు నష్టం..



ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉగ్రదాడి అనంతరం భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది.పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్రస్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. భారత్ దెబ్బకు దాదాపు 200 మంది ఉగ్రమూకలు హతం అయినట్లు కేంద్ర రక్షణశాఖ గతంలో పేర్కొంది. అంతేకాక పాకిస్థాన్ ఆర్థిక మూలాలపైనా భారత్ దెబ్బ కొట్టింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం నిలిపివేత, అటారీ- వాఘా బోర్డర్ మూసివేత, సింధూ జలాల పంపిణీ నిలిపివేత, ఇలా కఠిన చర్యలు చేపట్టింది.అయితే భారత్ చేపట్టిన ఆంక్షలకు బదులుగా పాకిస్థాన్ సైతం భారత్ పై ఆంక్షలు విధించింది. వాటిల్లో ప్రధానమైనది పాక్ గగనతలం మూసివేత. భారత్ విమానాలు పాకిస్థాన్ గగనతలం గుండా వెళ్లకుండా ఆ దేశం ఆంక్షలు విధించింది. అయితే తాజాగా ఈ ఆంక్షలను మరికొద్దిరోజుల పాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 24 వరకు ఆ బ్యాన్ ను పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. డొమెస్టిక్, మిలిటరీ లేదా ఇతర విమానాలు భారత్ నుంచి పాకిస్థాన్ గగనతలం నుంచి వెళ్లకుండా ఈ నిషేధం విధించింది. ఈ మేరకు పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీ కీలక ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు భారత్ కూడా పాకిస్థాన్ విమానాలు భారత గగనతలం గుండా వెళ్లకుండా ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు జులై 24 వరకు అమల్లో ఉంటాయి. ఆ తర్వాత ఈ నిర్ణయాన్ని పొడిగించే అవకాశం ఉంది. పాకిస్థాన్ పై మొదటిసారిగా భారత్ ఏప్రిల్ 30 న ఆంక్షలు విధించింది. ఏప్రిల్ 22 న జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. టైమ్ లైన్ పరిశీలిస్తే.. ఏప్రిల్ 24 న తొలిసారి పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. ఆ తర్వాత ఏప్రిల్ 30న భారత్ తన గగనతలాన్ని మూసివేసింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య విమాన రాకపోకలు నిలిచిపోయాయి. దౌత్య పరమైన చర్చలు, సమావేశాలు రద్దు అయ్యాయి. మరోవైపు సింధూ జలాల పంపిణీ రద్దును పున సమీక్షించుకోవాలని భారత్ కు పాకిస్థాన్ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే అనేక సార్లు లేఖలు రాసింది. అయితే భారత్ మాత్రం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు గట్టిగా బుద్ధి చెప్పాలని నిర్ణయం తీసుకుంది. ఇక సింధూ నదీజలాల ఒప్పందం 1960లో జరిగింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఈ ఒప్పందం జరిగింది.ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ ఈ ఒప్పందంపై 1960 సెప్టెంబరు 19న సంతకాలు చేశాయి. అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు ఆయుబ్ ఖాన్ లు ఈ ఒప్పందాలపై సంతకం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థ నుండి 20 శాతం నీటిని భారత్ కు.. మిగిలిన 80శాతం నీటిని పాకిస్థాన్ కు ఇవ్వాలని ఈ ఒప్పందంలో ఉంది.

# భారత్ కు పశ్చిమ దేశాల బిగ్ షాక్...!

## గుజరాత్ రిఫైనరీకి తొలి దెబ్బ..!



అంతర్జాతీయంగా వేగంగా మారుతున్న పరిణామాలు భారత్ కు తలనొప్పిగా మారాయి. గతంలో అలీన విధానం పేరుతో అన్ని దేశాలతో తటస్థ సంబంధాలు నడిపిన భారత్.. గత కొన్నేళ్లుగా తీసుకుంటున్న నిర్ణయాలు చర్చనీయాంశమవుతున్నాయి.అయినా కేంద్రం వాటి విషయంలో వెనక్కి తగ్గడం లేదు. దీంతో పశ్చిమ దేశాలు భారత్ పై కన్నెర్ర చేస్తున్నాయి. ఓవైపు ట్రంప్ సుంకాల పెంపుతో బెదిరింపులకు దిగుతుండగా.. మరోవైపు నాటో ఆంక్షలు విధిస్తామని హెచ్చరికలు చేస్తోంది. ఇదే క్రమంలో ఐరోపా యూనియన్ భారత్ కు తొలి షాక్ ఇచ్చింది.ఉక్రెయిన్ పై సుదీర్ఘ కాలం యుద్ధం చేస్తూ తలనొప్పిగా మారిన రష్యా దూకుడుకు కళ్లెం వేసే దిశగా పశ్చిమ దేశాలు ఈ మధ్య ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ కు అండగా నిలుస్తూ తమ ఆర్దిక వ్యవస్థలను కుప్పకూల్చుకోవడం ఇష్టం లేని ఆయా దేశాలు ఇప్పుడు వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రష్యాకు సహకరిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై ఆంక్షలు తప్పవని తాజాగా నాటో హెచ్చరించింది. అంతకు ముందే ఆయా దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ప్రకటించారు. తాజాగా నాటో భాగమైన ఐరోపా సమాఖ్య గుజరాత్ లో ఉన్న నయారా చమురు శుద్ధి కర్మాగారంపై ఆంక్షలు విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. రష్యా దూకుడుకు కళ్లెం వేసే లక్ష్యంతో యూరోపియన్ యూనియన్ నిన్న రష్యన్ చమురు ఎగుమతులపై ఆంక్షలు ప్రకటించింది. దీంతో రష్యా నుంచి చమురు కొంటున్న గుజరాత్‌లోని వాడినార్‌లో ఉన్న నయారా చమురు శుద్ధి కర్మాగారం పశ్చిమ దేశాల ఆంక్షల పరిధిలోకి వచ్చినట్లయింది. దీంతో ఈ కర్మాగారానికి ఇక పశ్చిమ దేశాల సాయం అందకపోవచ్చని భావిస్తున్నారు.దఈయూ చర్యపై కేంద్రం సీరియస్ గా స్పందించింది. తమపై ఏకపక్ష చర్యల్ని ఆమోదించబోమని విదేశాంగశాఖ తెలిపింది. తమది బాధ్యతాయుత దేశమని, తమ చట్టపరమైన బాధ్యతలకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని వెల్లడించింది. ఇంధన భద్రతపై ద్వంద్వ ప్రమాణాలను అంగీకరించలేమని కూడా తేల్చేసింది. భారత ప్రభుత్వం తన పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఇంధన భద్రతను అందించడం అత్యంత ముఖ్యమైన బాధ్యతగా భావిస్తుందని పేర్కొంది. ముఖ్యంగా ఇంధన వాణిజ్యం విషయానికి వస్తే ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని విదేశాంగశాఖ ప్రతినిధి రణ్ ధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈయూ ఆంక్షల ప్రభావంతో బ్యారెల్ కు 60 డాలర్లుగా ఉన్న రష్యా చమురు ధర పెరిగే అవకాశముంది. అలాగే జీ7 లో సభ్యులు కాని దేశాలు రష్యా చమురు తీసుకోవడానికి పశ్చిమ దేశాల షిప్పింగ్, ఇతర సేవల్ని వాడుకోవడానికి అవకాశం ఉండదు. అలాగే రష్యా నుంచి భారత్ కు చమురు తెచ్చే నౌకల్ని బ్లాక్ లిస్ట్ చేయడం వల్ల రవాణా పరిమాణాల్లో మార్పులు ఉంటాయి. మరోవైపు గుజరాత్ లోని నయారా రిఫైనరీపై ఆంక్షల వెనుక అందులో 49 శాతం భాగస్వామిగా ఉన్న రష్యా సంస్థ రోస్నెఫ్ట్ ను దెబ్బతీయడం ప్రధాన కారణం.

# అచ్చెన్నకు వరుస కష్టాలు

**శ్రీకాకుళం :** కింజారపు కుటుంబం అంటే సిక్కోలు జిల్లాలో తిరుగులేదు. ఇప్పుడు ఆ కుటుంబం నుంచి ఒకరు రాష్ట్రమంత్రిగా, మరొకరు కేంద్ర మంత్రిగా ఉన్నారు. కేంద్ర మంత్రిగా కింజారపు రామ్మోహన్ నాయుడు పౌరవిమానయాన శాఖను చేపట్టారు. యువకుడు కావడంతో ఆయనకు ఢిల్లీలో చంద్రబాబు కీలక బాధ్యతలను అప్పగించారు. అతి చిన్న వయసులో కేంద్ర మంత్రి అయిన రామ్మోహన్ నాయుడు మంచి పేరు సంపాదించుకున్నాడు. అయితే ఇటీవల అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదం ఘటనతో కొంత ఇబ్బంది పడినా ఆయన పనితీరు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. రామ్మోహన్ నాయుడుకు తెలుగుదేశం పార్టీలోనూ మంచి ప్రయారిటీ లభిస్తుంది...సైకిల్ తో సమానంగా వ్యవసాయశాఖ కావడంతో... అయితే ఇదే సమయంలో రామ్మోహన్ నాయుడు బాబాయి అచ్చెన్నాయుడు మాత్రం మంత్రిపదవిలో ఉన్నా ఆనందం మాత్రం లేదు. అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండటమే ఇందుకు కారణం. అందరు మంత్రులదీ ఒక ఎత్తు. అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మరొక ఎత్తు. నిరంతరం ఏదో ఒక సమస్య అచ్చెన్నాయుడును శాఖాపరంగా వెంటాడుతూనే ఉంది. ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. క్షణం తీరిక లేకపోయినా ఏదో ఒక సమస్య మెడకు వచ్చి చుట్టుకుంటుంది. ఒక సమస్య నుంచి బయటపడ్డామని భావించే లోపు మరొక సమస్య వచ్చి పడుతుండటంతో అచ్చెన్నాయుడుకు ఊపిరిసలపకుండా చేస్తున్నాయనే చెప్పాలి. సహజంగా హోం మంత్రికి కొన్ని ఇబ్బందులుంటాయి. కానీ అదేమి విచిత్రమో కానీ ఈ ఏడాదికాలంలోనే వ్యవసాయ శాఖ మంత్రికి వచ్చినన్ని కష్టాలు ఏ శాఖకు రాలేదంటే అది అచ్చెన్న దురదృష్టమేనని సొంత పార్టీ నేతలే అంటున్నారు. వ్యవసాయ శాఖలో మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు పనితీరుపైన కూడా ఇవి ప్రభావం చూపే అవకాశముందంటున్నారు. పొగాకు, మిర్చి, మామిడి పంటలకు సరైన గిట్టుబాటు రాకపోవడంతో రైతులు రోడ్డెక్కారు.


%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999